
మినీ కథ

# పెరుగుట

కన్నేపల్లి గోపాలకృష్ణ




## 1930 —

భోషాణప్పెట్టె మీద కూర్చుని చిల్లరరూపాయలు లెక్కపెట్టుకుంటున్నాడు పేరిశాస్త్రి. తలుపు వెనక నిలబడి మెల్లగా ఏదో చెప్తోంది భార్య.

ఊఁ కొడుతూనే లెక్కపెట్టడం పూర్తిచేసి తలెత్తాడు అతను.

"ఎలానే సుబ్బీ! మాసమంతా కష్టపడితే వచ్చిన సొమ్ము ముప్పై రూపాయలు. నెలంతా గడవడానికి నువ్వు చెపుతున్న ఖర్చు ముప్పై మూడు రూపాయల రెండణాలు. ఇంకా ఆ మూడు రూపాయలని ఎక్కడి నుంచి తెచ్చేది నేను? ఇప్పటికే ఇరవయ్యారు రూపాయల అప్పు వుంది. అయినా అన్ని వస్తువుల ధరలూ ఇలా దారుణంగా పెరుగుతున్నాయేమిటే? తులం బంగారం పాతిక రూపాయలా? బస్తాడు బియ్యం ఎనిమిది రూపాయల ఎనిమిదణాలా? ఆవు నెయ్యి సంగతి చెప్పనే అక్కరలేదు. పప్పులూ, ఉప్పులూ సరేసరి. ఏది తక్కువయినా ముద్ద దిగదు మనకి. సర్కారువారి జీతమయినా పెంచరు. ఈ సర్దుబాటు జీవితం ఇంకెన్నాళ్ళో?" అని నిట్టూర్చాడు.

** ** **

## 1986 —

జేబులోని నోట్ల కవరు తీసి డబ్బు లెక్కపెట్టుకున్నాడు మూర్తి మరోసారి. లెక్క పూర్తయిన తరువాత కాగితం తీసుకొని చేయవలసిన ఖర్చులు వ్రాయసాగాడు. ఎన్ని ఖర్చులు తగ్గించుకున్నా ఆదాయం కన్నా వ్యయమే ఎక్కువగా కనబడుతోంది. తల పట్టుకుని విసుగ్గా కూలబడ్డాడతను.

"ఏమిటండీ అలా వున్నారు? తలనొప్పా?" కాఫీ కప్పు బల్లమీద పెడుతూ అంది మాధవి.

"ప్రతి ఫస్టుకీ వచ్చే సమస్యేగా మధూ! వచ్చే జీతం గొర్రె తోకంత. ఖర్చులు చూస్తే నాలుగు బారలు. పన్నెండు వందల రూపాయలు వస్తున్నాయన్న మాటే కానీ ఏ మూలకు చాలుతోంది? బడ్జెట్ ఎప్పుడూ 'మైనస్సే'గా. ఈ నెల కూడా అప్పుచేస్తేనేగాని గడిచేట్టు లేదు. ఇప్పటికే ఏడొందలు అప్పు పడ్డాను. ఇంకా ఇచ్చేదెవరు? అయినా సరుకుల ధరలెందుకింత విపరీతంగా పెరిగిపోతున్నాయో అర్థం కావడం లేదు. నా చిన్నతనంలో ఎంత హాయిగా వుండేది? కిలో బియ్యం రూపాయి. తులం బంగారం నూటయాభై. ఇప్పుడో?? ఎందుకులే! దినదినమూ వచ్చేచావుగా వుంది మనబోటి వాళ్ళకి. జీతాలయినా పెంచదు గవర్నమెంటు" భారంగా నిట్టూరుస్తూ కాఫీ అందుకున్నాడు.

** ** **

## 2025 —

ఇల్లు అనబడే ఇరుకు గదిలో కుర్చీ మీద కూర్చుని పది వేల రూపాయలని మాటిమాటికీ లెక్కపెడుతూ కాగితంపై కొట్టివేతలూ, దిద్దివేతలూ, సవరింపులూ చేస్తూ పెదవి విరుస్తున్నాడు దీపక్.

భార్య తెచ్చిన మంచినీళ్ళు గుటగటా తాగేస్తూ అన్నాడు "ఈ రోజు కూడా పంచదార రాలేదా?"

"తెలియదండి. వచ్చినా వెళ్ళేవారెవరండీ? మీకూ, నాకూ ఆఫీసుంతోనే సరిపోతుంది. ఎలాగో తీరిక చేసుకొని వెళ్ళినా మనవంతు వచ్చేసరికి 'స్టాకు నిల్' బోర్డు దర్శనం అవుతుంది. ముప్పై అరిచ్చి బ్లాకులో కొనలేంగా! అందుకనే కాఫీ, టీలు ఇక నుంచి మానేద్దామనుకుంటున్నాను. అయినా ఇంత ఖరీదైన అలవాటు చేశారేమిటండీ మనవాళ్ళు మనకి."

"ఖరీదయిన అలవాటా?" నవ్వాడతను.

"మన చిన్నతనాన్ని ఒక్కసారి గుర్తుతెచ్చుకో సుషమా! అప్పుడు పంచదార కిలో ఎంత వుండేదీ? పదిహేను రూపాయలు కాదూ. టీ కేజీ వందకే వచ్చేది. బియ్యం బస్తా వెయ్యి రూపాయలకే దొరికేది. ఇప్పుడో?? తలుచుకోడానికే భయమేస్తోంది. అబ్బ, పాత రోజులెంత బంగారు రోజులు. రెండు పూటలా కడుపునిండా తినేవాళ్ళం. ఇప్పుడు రెండుపూటలా జొన్న రొట్టెలూ, వారానికోసారి అన్నమూ తింటున్నాం. అయినా మనిద్దరి జీతాలూ చాలడం లేదు. ఫస్టు వస్తోందంటే భయంగా వుంది. ఎంతసేపూ ఆదాయానికి మించిన ఖర్చే కదా. అయినా గవర్నమెంటెందుకు ధరలు తగ్గించడం లేదు? బియ్యం బస్తా నాలుగు వేల రూపాయలూ, తులం బంగారం... హు. దాని సంగతెందుకులే? చూసి చాలా రోజులయింది - రేపోసారి మ్యూజియంకెళ్ళాలి చూడ్డానికి.

పప్పుదినుసుల గురించి ఎంత తక్కువగా చెప్పుకొంటే అంత మంచిది కదూ! అయినా ఈ చాలీచాలని జీతాలింకెన్నాళ్ళు? మనిషి కనీసం ఒకపూటైనా తృప్తిగా తినే రోజు మళ్ళీరాదా? ఆ బాధ్యత ప్రభుత్వానికి లేదా? సరిపడా జీతాలు పెంచదా?" ఆవేశంగా చెప్పాడతను.

** ** **

తరతరాలుగా నడుస్తున్న చరిత్రే ఇది. మరిన్ని తరాలు మారినా ఇదే చరిత్ర నడుస్తుంది. భూమి వున్నంత వరకూ ధరలు పెరగడం మానవు. ధరలు పెరుగుతున్నాయని ప్రభుత్వం అంతో ఇంతో పెంచక మానదు. జీతాలు పెరిగాయని మళ్ళీ ధరలు పెరక్క మానవు. ఇదో విషవలయం. ఎప్పటికప్పుడు అవసరాలను కుదించుకుంటూ ఎలాగో జీవితాన్ని నెట్టెయ్యడమే సామాన్య మానవుడు చేయగలిగేది!! అవును కదూ!!!